TGTEL /2018/75056

# తెలంగాణభూమి

తెలుగు దినపత్రిక




నల్గొండ | జులై 30 గురువారం 2026 | సంపుటి : 9 | సంచిక : 42 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : కొండ నరసింహస్వామి

NALGONDA | THURSDAY JULY 30 2026 | VOL:9 | ISSUE: 42 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: Konda Narasimha swamy




**హైదరాబాద్, జూలై 29**

తాము ప్రభుత్వాధినేతలమని విర్రవీగుతున్న నేతలకు కాంగ్రెస్ హైకమాండ్ కళ్లెం వేయాలని నిర్ణయించిందా? ప్రభుత్వం కన్నా పార్టీయే సుప్రీం అనే సందేశమివ్వాలని భావించిందా? సర్కార్‌లో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. పార్టీకి మాత్రం కార్యకర్తే అనే సంకేతం ఇచ్చిందా? ఢిల్లీలో బుధవారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశమే ప్రత్యక్ష సాక్ష్యమా? ప్రభుత్వంలోని కీలక వ్యక్తులను ఢిల్లీకి పిలిపించి ఉద్దేశపూర్వకంగానే వంశీచంద్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించిందా? తద్వారా ప్రభుత్వ పెద్దల అహంకారాన్ని తగ్గించి, వారిని అవమానించిందా? ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో పెద్దఎత్తున జరుగుతున్న చర్చ ఇది. ఢిల్లీ వర్గాలు దీనికి అవును అనే సమాధానమే ఇస్తున్నాయి. 'ముఖ్యమంత్రి అయినా, ఉప ముఖ్యమంత్రి అయినా, ప్రభుత్వంలోని కీలక మంత్రులైనా సరే అందరికంటే పార్టీయే సుప్రీం. అంతేకాదు.. ఎవరైనా తోక జాడిస్తే కట్ చేస్తం' అని ప్రభుత్వాధినేతలకు కాంగ్రెస్ హైకమాండ్ హెచ్చరికలు జారీ చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. కాగా, తెలంగాణ నేతల సమన్వయ సమావేశం పెట్టిన ఏఐసీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ డుమ్మాకొట్టారు. కానీ తర్వాత జరిగిన ఛత్తీస్‌గఢ్ నేతల మీటింగ్‌కు కేసీ మాత్రం హాజరయ్యారు. ఇది దేనికి సంకేతమన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతున్నది.

(మిగతా 3వ పేజీలో..)

## కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

- ఎల్ఐసీ నుంచి రూ.12,207 కోట్ల డివిడెండ్
- యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2,853 కోట్లు
- న్యూ ఇండియా అష్యూరెన్స్ నుంచి రూ.211 కోట్లు
- పీఎస్‌బీల జీఎన్‌పీఏ 1.9 శాతానికి తగ్గుదల
- ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు నెలకొల్పాయి.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల

(మిగతా 3వ పేజీలో..)



## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల

(మిగతా 3వ పేజీలో..)



## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

- అమిత్ షాపై రాహుల్ గాంధీ మరోసారి ఆరోపణలు
- క్షమాపణ చెప్పబోనని స్పష్టీకరణ
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని ఆరోపణ
- మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్ల ప్రస్తావన
- అమిత్ షా పోలీసులతో మాట్లాడారని వ్యాఖ్య
- రాహుల్ ఆరోపణలను ఖండించిన కేంద్రం

లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు

(మిగతా 3వ పేజీలో..)



## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు

(మిగతా 3వ పేజీలో..)



తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. "అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు.నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపించారు. ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య నివేదికను తాను చూశానని చెప్పారు. మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్లతో మహిళలు, మైనర్లపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన సమయంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడడం తాను స్వయంగా చూశానని కూడా పేర్కొన్నారు. ఆ తర్వాత జితేంద్ర సింగ్ కు అమిత్ షా నుంచి వరుసగా కాల్స్ వచ్చాయని అన్నారు.అంతకుముందు లోక్‌సభలో రాహుల్ చేసిన ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. స్పీకర్ ఓం బిర్లా కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దని సూచించారు. మరోవైపు రాహుల్ ఆరోపణలను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పూర్తిగా ఖండించారు. నిరసనల సమయంలో కాల్పులు జరగలేదని, అలాంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు.

## కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్


(మొదటి పేజీ తరువాయి)

డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది.ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది. ప్రతి ప్రభుత్వ రంగ బ్యాంకు 90 శాతానికి పైగా ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియోను కొనసాగించింది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థమైన రిస్క్ మేనేజ్‌మెంట్ బ్యాంకుల ఆర్థిక బలాన్ని మరింత పెంచాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (PKOCP) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.



# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది.ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# ప్రభుత్వం కాదు.. పార్టీయే సుప్రీం..!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర నేతలకు ఘోర అవమానం!!

బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ పాల్గొన్నారు. సమావేశానికి ఖర్గే, కేసీ వేణుగోపాల్ డుమ్మా కొట్టారు. వారి స్థానంలో సీడబ్ల్యూసీ సభ్యుడు, రాష్ట్రానికి చెందిన జూనియర్ నేత వంశీచంద్‌రెడ్డిని పంపించారు. ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. హోదా ప్రకారం వంశీచంద్‌రెడ్డిదే పైచేయి అయినా, రాష్ట్రానికి చెందిన కీలక నేతల సమావేశానికి అధ్యక్షత వహించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య ద్వారా రాష్ట్ర కీలక నేతలను కాంగ్రెస్ హైకమాండ్ ఘోరంగా అవమానించిందని, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వేదికగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరోసారి తాకట్టు పెట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కావాలనే 'పెద్దల' డుమ్మా !

రాష్ట్ర ముఖ్యనేతను, ఇతర కీలక నేతలను తక్కువ చేసే ఉద్దేశంతోనే హైకమాండ్ ఇలాంటి ఎత్తుగడ వేసిందనే చర్చ జరుగుతున్నది. ఖర్గే, కేసీ కావాలనే డుమ్మా కొట్టారని చెప్పుకొంటున్నారు. రాష్ట్ర నేతలకు కీలక సంకేతాలు పంపించాలనే ముందస్తు ప్రణాళికలో భాగంగానే అధిష్ఠానం పెద్దలు వారిద్దని సమావేశానికి వెళ్లొద్దని చెప్పినట్లు ఢిల్లీ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ సమావేశాలు ఉండటం వల్లే హాజరుకాలేకపోయారని వారిద్దరూ చెప్పినట్టు సమాచారం. కేసీ ఢిల్లీలోనే జరిగిన ఛత్తీస్‌గఢ్ నేతల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. దీంతో రాష్ట్ర నేతలకు, వేణుగోపాల్‌కు మధ్య దూరం పెరిగిందని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర నేతలపై కేసీ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వంతో ఎంత పెద్ద వారైనా పార్టీలో కిందివారే అనే సంకేతాలు ఇచ్చేందుకే వంశీచంద్‌రెడ్డిని కీలక స్థానంలో కూర్చోబెట్టి సమావేశం నిర్వహించారని తెలుస్తున్నది.

# రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే.. బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు


**కర్ణాటక ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై ఎఫ్ఐఆర్ నమోదు**
**బాబ్రీ మసీదు ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు**
**కాంగ్రెస్ ఫిర్యాదుతో కేసు నమోదు**
**వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
**కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్**



లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఇదే తరహా రాజకీయాలు కొనసాగిస్తే రాహుల్ గాంధీ కుటుంబానికీ అదే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రసంగం వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది.ఉడుపిలో నిర్వహించిన బీజేపీ కార్యక్రమంలో యశ్‌పాల్ సువర్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉడుపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ కొడవూర్ ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఎమ్మెల్యే మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కర్ణాటక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మంజునాథ్ భండారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం, దేశవ్యాప్త నిరసనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాహుల్ గాంధీపై బీజేపీ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉన్న ఇతర బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం ఆందోళనకరమని అన్నారు.

## తమిళనాడు స్కూళ్లలో ఘుమఘుమలు.. మధ్యాహ్న భోజనంలో చికెన్ బిర్యానీ ప్రతిపాదన

పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి 'చికెన్ బిర్యానీ' అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సాంఘిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో సంప్రదింపులు జరిపిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారానికి ఒకసారి ప్రోటీన్లు అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడం వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.దీంతో పాటు భోజనం నాణ్యతను, ముఖ్యంగా పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తమిళనాడులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా 1 నుంచి 8వ తరగతి వరకు 32 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రెండు పథకాలను 11, 12 తరగతులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అంచనా. హయ్యర్ సెకండరీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి హాజరు మెరుగుపడి, డ్రాపవుట్లు తగ్గుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో ఇలాంటి పథకాలకు మార్గదర్శకంగా నిలిచిన తమిళనాడు, చికెన్ బిర్యానీ ప్రతిపాదనతో మరో ముందడుగు వేసినట్టు అవుతుంది.





# ఘనంగా గురు పూర్ణిమ వేడుకలు

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్.**

గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం నల్గొండ పట్టణంలోని వీటి కాలనీలో నీ శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయములో ఆలయ కమిటీ సభ్యులు కాలనీవాసులు తో పాటు ప్రజలందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి బాబాను దర్శించుకుని, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నాగులపల్లి శ్యాంసుందర్ మాట్లాడుతూ గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువులకు అత్యున్నత స్థానం కల్పించే పవిత్రమైన పర్వదినం అని అన్నారు. షిరిడి సాయిబాబా బోధించిన మానవత్వం సేవాభావం సత్యం సహనం వంటి విలువలు ప్రతి ఒక్కరు జీవితంలో ఆచరించాలని ఆయన కోరారు. సమాజంలో ప్రేమ సోదర భావం సేవాస్ఫూర్తి మరింత పెంచాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. న్యూ వీటి కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజామునే కాకడ హారతి అనంతరం దత్త స్వామి సాయిబాబా నూతన వస్త్ర అలంకరణ, పుష్పాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ గురు చరిత్ర ఆకాండ పారాయణం, శ్రీ వ్యాసమహర్షి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం హారతి అనంతరం ప్రసాద వితరణ సాయంకాలం హారతి స్వామి ,వారి పల్లకి సేవ



మహోత్సవాలు తేజ్ హారతి అనంతరం ప్రసాద్ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌను గోపాలకృష్ణమూర్తి పెండెల నాగేశ్వరరావు చల్లాలింగారెడ్డి రావుల శ్రీనివాసరెడ్డి శ్రీపాద కృష్ణమాచారి మా రెడ్డి శ్రీనివాసరెడ్డి లకుమారపు శ్రీనివాస్ శ్రీపాద జ్యోతి రేవుల రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్‌లో అత్యంత విలువైన టీమ్ ఇదే!

**ఐపీఎల్ విలువ రూ.1.97 లక్షల కోట్లు**
**ఆర్సీబీ బ్రాండ్ విలువ రూ.2,987 కోట్లు**
**సీఎస్కే నాలుగో స్థానానికి పరిమితం**
**ఆర్సీబీ, రాజస్థాన్‌కు కొత్త యాజమాన్యాలు**
**ఎస్ఆర్‌హెచ్ ఐదు, ఆర్ఆర్ ఆరో స్థానం**
**డిజిటల్ వృద్ధితో ఐపీఎల్‌కు మరింత బలం**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా మరింత బలపడింది. హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వాల్యుయేషన్ స్టడీ ప్రకారం లీగ్ మొత్తం వ్యాపార విలువ రూ. 1,97,024.68 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం పెరిగింది. లీగ్ బ్రాండ్ విలువ కూడా రూ. 41,106 కోట్లకు చేరి 10.3 శాతం వృద్ధి నమోదు చేసింది.బ్రాండ్ విలువలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సుమారు రూ. 2,987 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రూ. 3 వేల కోట్ల మార్కుకు చేరువైన తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ముంబై ఇండియన్స్ దాదాపు రూ. 2,528 కోట్లతో రెండో స్థానంలో నిలవగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ సుమారు రూ. 2,346 కోట్లతో మూడో స్థానం దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ. 2,336 కోట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సుమారు రూ. 1,608 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ దాదాపు రూ. 1,541 కోట్లతో ఆరో స్థానం దక్కించుకుంది. పంజాబ్ కింగ్స్ రూ. 1,513 కోట్లతో ఏడు, గుజరాత్ టైటాన్స్ సుమారు రూ. 1,503 కోట్లతో ఎనిమిదో స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్ దాదాపు రూ. 1,494 కోట్లతో తొమ్మిది, లక్నో సూపర్ జెయింట్స్ సుమారు రూ. 1,168 కోట్లతో పదో స్థానంలో నిలిచాయి. 2026లో ఫ్రాంచైజీల యాజమాన్యంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌తో కూడిన కన్సార్టియం ఆర్సీబీని సుమారు రూ. 17,042 కోట్ల విలువకు కొనుగోలు చేసింది. మరోవైపు మిట్టల్ కుటుంబం, అదర్ పూనావాలా కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను సుమారు రూ. 15,797 కోట్ల విలువతో సొంతం చేసుకున్నారు. ఐపీఎల్‌కు ప్రపంచ పెట్టుబడిదారుల నుంచి లభిస్తున్న ఆదరణకు ఈ ఒప్పందాలు నిదర్శనమని నివేదిక పేర్కొంది.




# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్



క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

## గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించిన శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల



**(తెలంగాణ భూమి జూలై 29)**

నల్గొండ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షు లు దోసపాటి శ్రీనివాస్, ప్రబంధ కార్ని అధ్యక్షులు గోవింద సుధాకర్, కార్యదర్శి తీరం దాసు లక్ష్మీనారాయణ, కోశాధికారి నేలపట్ల రవీందర్, సభ్యులు కొండ నవీన్, తోగోటి రమేష్, సలహా మండలి సభ్యులు గంజి రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోసపాటి శ్రీనివాస్, గోవింద సుధాకర్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గురు పౌర్ణిమ విశిష్టత గురు శిష్యుల మధ్య గొప్పదనం గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని ఆయన వివరించారు గురువుల ఆశీస్సులతోనే విద్యార్థుల జీవితం ఉన్నత శిఖరాలకు అధిరోహించిన అధిరోహించగలరని తెలిపారు. విద్యార్థులు గురువులకు నమస్కరించి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. గురు పౌర్ణిమ వేడుకలను విజయవంతం చేశారు.

## భక్తిశ్రద్ధలతో మణికేశ్వరి మాత పుట్టినరోజు వేడుకలు

**(తెలంగాణ భూమి జూలై 29 )**

గంధ వారి గూడెం ఆశ్రమంలో ఓంకార స్వరూపిణి శ్రీ శ్రీ జగద్గురు బాలయోగిని మనికేశ్వరి మాత జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నల్గొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆశ్రమ ప్రధాన కార్యదర్శి దేశ గంగాధర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాత గారి దివ్య పాదుకులకు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు దత్తాత్రేయ స్వరూపిణిగా భక్తులు ఆరాధించే శ్రీ శ్రీ శ్రీ జగద్గురు బాలయోగిని మనికేశ్వరి మాత జీవితం తపస్సు ఆధ్యాత్మిక సేవ భక్తులు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాకర్ రావు, జగ్జీవన్ రెడ్డి, నాగిరెడ్డి, విశాల్ వెంకట రాములు, కంది సూర్యనారాయణ, గోవర్ధన్,చింత ముత్యాలరావు పాల్గొన్నారు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు ఈ సందర్భంగా దేశ గంగాధర స్వామి మాట్లాడుతూ మనికేశ్వరి మాత దివ్య ఆశీస్సులు అందరి పైన ఉండాలని భక్తులకు ఆధ్యాత్మిక మార్గంలో శాంతి సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.

## గురుపౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించిన శ్రీ సరస్వతి శిశు మందిర్.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

నల్గొండ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బుధవారం గురుపౌర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షులు దోసపాటి శ్రీనివాస్, ప్రబంధకారిణి అధ్యక్షులు గోవింద్ సుధాకర్, కార్యదర్శి తిరందాసు లక్ష్మీనారాయణ, కోశాధికారి నేలపట్ల రవీందర్, సభ్యులు కొండ నవీన్, తొగోటి రమేష్, సలహా మండలి సభ్యులు గంజి రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దోసపాటి శ్రీనివాస్, గోవింద్ సుధాకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గురుపౌర్ణిమ విశిష్టత, గురు--శిష్య పరంపర గొప్పతనం, గురువుల పట్ల గౌరవభావం కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. గురువుల ఆశీస్సులతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు.విద్యార్థులు గురువులకు నమస్కరించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని గురుపౌర్ణిమ వేడుకలను విజయవంతం చేశారు.

## శివాజీ నగర్ సాయిబాబా పూజలో పాల్గొన్న మొదటి అదనపు జిల్లా జడ్జి కవిత

**తెలంగాణ భూమి జులై 29 )**



నల్లగొండ శివాజీ నగర్ లో గల సాయిబాబా ఆలయంలో గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమానికి నల్లగొండ మొదట మొదటి అదనపు జిల్లా జడ్జి కవిత పాల్గొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు ఈ యొక్క కార్యక్రమంలో అన్నదానం కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించడం జరిగింది.

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

# సీనియర్ సినీ నటి పావలా శ్యామల కన్నుమూత





**అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి**

**'పావలా' నాటకంతో ఇంటిపేరుగా స్థిరపడిన నేతి శ్యామల**

**250కి పైగా చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు**

**స్వర్ణకమలం, ఖడ్గం, అతడు వంటి చిత్రాలతో పాప్యులారిటీ**

ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు. ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

## ఇకపై నా ప్రయాణం సాధారణంగా ఉండదు: పొలిటికల్ ఎంట్రీపై క్లూ ఇచ్చిన హీరో విశాల్

నటుడిగా ప్రజల నుంచి ఎంతో అభిమానాన్ని పొందానన్న విశాల్

మీ కోసం ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నానని వ్యాఖ్య

సమయం అనుకూలిస్తే ప్రజాక్షేత్రంలో నిలబడతానని వెల్లడి

కోలీవుడ్‌లో స్టార్ హీరోలంతా వరుసగా రాజకీయ బాట పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 'తమిళగ వెట్రి కళగం' పార్టీతో తుపాను సృష్టించిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. మరోవైపు, ఇటీవల మరో హీరో ధనుష్ చేసిన కామెంట్స్ ఆయన కూడా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారనే చర్చకు తెరలేపాయి. తాజాగా ఈ జాబితాలో మాస్ హీరో విశాల్ కూడా చేరారు. ఓ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు తమిళనాడులో తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.సినిమా రంగంలో ఇన్నాళ్లు సంపాదించుకున్న ప్రజాదరణను, మంచి పేరును ఇకపై ప్రజాసేవ కోసం ఉపయోగించాలని భావిస్తున్నట్లు విశాల్ ప్రకటించారు. "ఇన్ని సంవత్సరాలుగా ఇండస్ట్రీలో నటుడిగా మీ నుంచి ఎంతో ప్రేమను, అభిమానాన్ని పొందాను. ఆ అభిమానానికి, ప్రేమకు ప్రతిఫలంగా మీకు తిరిగి ఏదో ఒకటి చేయాలని బలంగా నిశ్చయించుకున్నాను. ఇకపై నా ప్రయాణం గతంలో మాదిరి సాధారణంగా ఉండదు. నేరుగా, అత్యంత నిజాయతీగా ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాను. అన్ని రకాలుగా మీకు అండగా ఉంటాను" అని వ్యాఖ్యానించారు.ఇప్పటికే నడిగర్ సంగమ్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ బాధ్యతల్లో తనదైన ముద్ర వేసిన విశాల్, గతంలోనూ ఆర్‌కే నగర్ ఉపఎన్నికలో పోటీకి యత్నించిన సంగతి తెలిసిందే. రాజకీయ నాయకులు సరిగా పనిచేయనందునే కొత్త రక్తం రాజకీయాల్లోకి రావాల్సి వస్తోందని, త్వరలోనే తన రాజకీయ పయనానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని సూచించారు. ఇకపై తన అభిమాన సంఘాన్ని ప్రజా సేవ కోసం కూడా నడిపిస్తానని తెలిపారు. తన ఆలోచన వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవని... సమయం అనుకూలిస్తే ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో నిలబడతానని స్పష్టం చేశారు. విశాల్ వ్యాఖ్యలను బట్టి ఆయన త్వరలోనే సొంత పార్టీ ప్రకటన లేదా క్రియాశీల రాజకీయాల్లోకి దిగడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# 'శ్రీనివాస మంగాపురం' రన్ టైమ్ ఇదే!

ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. "సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ" (వీశీర్ ఱత్‌వఅంవ శ్రీశీజవ ర్‌శీతీఎ) అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.'=శ 100' చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రంతో ఘట్టమనేని కుటుంబం నుంచి జైకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కానుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఇదే సినిమాతో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కూడా టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్ డేట్స్ ద్వారా జయకృష్ణ ఘట్టమనేని, రాషా కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో సీనియర్ నటుడు మోహన్ బాబు పవర్ ఫుల్ రోల్ లో కనిపించను న్నారు.టాలీవుడ్ లెజెండరీ నిర్మాత, వైజయంతీ మూవీస్ అధినేత సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం సినిమా స్థాయిని పెంచుతోంది. చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి పతాకంపై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భావోద్వేగభరితమైన కథలకు తన సంగీతంతో ప్రాణం పోసే ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చారు.అజయ్ భూపతి మార్క్ టేకింగ్, ఘట్టమనేని వారసుడి అరంగేట్రం, అశ్వనీదత్ సమర్పణ వంటి బలమైన అంశాలతో వస్తున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రాన్ని జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.





# రిజర్వేషన్లపై ఫేక్ పోస్ట్.. తీవ్రంగా స్పందించిన శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు.ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచు

Printed,Published and Owned by : **Konda Narasimha swamy** PRINTED AT : **KOUSAYA PRINTERS ,** H.NO 6-1-948 BOYAWADA STREET, DIST: NALGONGA TELANGANA 508001. RNI NO - **TGTEL/2018/75056.** CELL NO : 7989870511.